సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 29 । మార్చి । 2024



ఎన్నికల అక్రమాలపై నిరంతర నిఘా -IIలో
ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తోంది.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం -IIలో
కొమరాడ మండలం చినఖేర్జెలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర (సా॥)	శని (ఉ॥)
6.15	4.32

న్యూస్‌రీల్

మాణికేశ్వరమ్మకు ప్రత్యేక పూజలు



తాటిశీల మాణికేశ్వరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ తాటిశీల గ్రామంలోని మాణికేశ్వరమ్మ ఆలయాన్ని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం దర్శించారు. గ్రామస్తులంతా కలిసి నిర్మించుకున్న ఆలయంలో ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమం వేదాంతి రంపా తాతబాబుశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న పుష్పశ్రీవాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని ప్రార్థించారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, వేదపండితుల ఆశీస్సులు అందుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీ నిమ్మకశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి తీసుకెళ్తుండగా గర్భిణి ప్రసవం



గర్భిణిని కొండ నుంచి డోలీలో కిందకు తీసుకొస్తున్న గిరిజనులు

సీతంపేట: మండలంలోని రంగంవలస గ్రామానికి చెందిన గర్భిణి సవర చిన్నమ్మిని గురువారం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో ప్రసవించింది. మగబిడ్డకు జన్మనిచ్చింది. గిరిశిఖర గ్రామమైన రంగంవలసకు సరైన దారి సదుపాయం లేదు. 108 వెళ్లేందుకు వీలుకాలేదు. చిన్నమ్మికి పురిటినొప్పులు రావడంతో మైదాన ప్రాంతానికి తెచ్చి అక్కడి నుంచి 108 వాహనంలో మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించేందుకు బంధువులు ప్రయత్నించారు. డోలీలో కొండనుంచి కిందకు తీసుకొస్తుండగా పురిటినొప్పులు ఎక్కువ కావడంతో గ్రామ మహిళలు పురుడుపోశారు. అనంతరం తల్లీబిడ్డను మర్రిపాడు పీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

జీఎంఆర్ ఐటీలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ లక్ష్మణమూర్తి, ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 309 మంది విద్యార్థులు 309 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. వీరిని జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ ఎల్.ఎం.లక్ష్మణమూర్తి, జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ అభినందించారు. రక్తదానానికి మించిన సేవా కార్యక్రమం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో సీఏఓ సుప్రియ బట్టాచార్య, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్ల (ఏపీఎంఎస్)లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బోధన ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీలోపు 'ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' 'సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల మేరకు సీట్లు కేటాయిస్తారు.

నాడు దైన్యం.. నేడు ధైర్యం

గతంలో విత్తు నాటిన నుంచి పంట విక్రయం వరకూ కష్టాల కన్నీళ్లు దిగమింగి అందరికీ అన్నం పెట్టే రైతన్న పరిస్థితి దీనంగా ఉండేది. ప్రస్తుతం రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పాలన కర్షకుడిలో దీనస్థితిని పారదోలి ధైర్యాన్ని నింపి సాగుపై భరోసా కల్పిస్తోంది. ప్రధానంగా పంట విక్రయంలో దళారులు, మిల్లర్ల పాత్రను అరికట్టడంతో రైతుకు సేద్యం గిట్టుబాటుగా మారి తగినంత 'మద్దతు' ధరలభిస్తోంది.

-సాక్షి, పార్వతీపురం మన్యం



- అన్నదాతల్లో స్పష్టంగా మార్పు
- రైతుల నుంచి 3,23,455 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 2023-24 ఖరీఫ్‌లో మొత్తం రూ.483 కోట్ల చెల్లింపు
- బకాయి ఉన్న రూ.48 కోట్లు జమ

సంవత్సరం	మద్దతుధర (క్వింటాకు)	ఎ-గ్రేడ్	సాధారణ రకం	రైతులు	కొనుగోలు (ఎంటీలు)	చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో)
2022-23	2,060	2,040	45,346	3,18,734	467.44
2023-24	2,203	2,183	56,316	3,23,455	483.17

రైతు సంక్షేమమే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. గతంలో రైతు పండించిన పంట దళారులు, మిల్లర్లకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి. వారు ఏదో సాకు చూపి ధాన్యంలో కోత వేసేవారు. మద్దతు ధర లభించేది కాదు. దీనివల్ల పెట్టిన పెట్టుబడి కూడా రైతు చూడలేక పోయేవాడు. అయితే గత మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి మారింది. మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి..సిబ్బంది వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు నేరుగా ఆర్‌బీకేలు, కళ్లాల వద్దే ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 306 రైతు భరోసా కేంద్రాలుండగా..185 పీపీసీలను ఏర్పాటు చేశారు. వాటిని మూడు కేటగిరీలుగా విభజించి రైతుల నుంచి ధాన్యం సేకరించారు. రైస్ మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారులను నియమించారు. మండల స్థాయిలో ప్రొక్యూర్‌మెంట్ కమిటీలతో పర్యవేక్షణ పెంచారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించే పరికరాలు..యాప్, బయోమెట్రిక్ అందుబాటులోకి తెచ్చారు. రవాణా వాహనాలకు జీపీఎస్ అమర్చారు. రైస్ మిల్లుల ఎంపిక కూడా ర్యాండమైజేషన్ ప్రకారమే జరగడంతో అవినీతి తగ్గింది. ఈ నిర్ణయాల వల్ల సీజన్‌లో ప్రొక్యూర్‌మెంట్ వేగవంతమైంది. వీటన్నింటిపైనా రైతుల్లో సంపూర్ణ అవగాహన పెరిగింది. ఎక్కడా మోసపోకుండా మద్దతు ధర పొందడానికి వీలుపడింది. తుపాన్లలో దెబ్బతిన్న పంటకు సైతం ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఆ భారాన్నీ తానే భరిస్తూ, నాణ్యత లేని ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసింది.

పెరిగిన సార్టెక్స్ మిల్లులు

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన సార్టెక్స్, ఫోర్టిఫైడ్ బియ్యం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే భావించిన విషయం విదితమే. జిల్లాలో పండించిన ధాన్యాన్ని ఇక్కడి మిల్లుల్లో సార్టెక్స్ చేయించి తిరిగి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో రైస్ మిల్లుల్లో సార్టెక్స్, ఫోర్టిఫైడ్ యంత్రాలు పెట్టుకోవాలని సూచించింది. జిల్లా ఆవిర్భావం తర్వాత కేవలం ఆ తరహా మిల్లులు 22 మాత్రమే ఉండేవి. దీనివల్ల ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించాల్సి వచ్చేది. ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో ఈ రెండేళ్ల కాలంలో జిల్లాలో 95 వరకూ మిల్లులు ఆ యంత్రాలను సమకూర్చుకున్నాయి. దీంతోపాటు వెనుకబడిన జిల్లా కావడంతో ధాన్యం రవాణాకు మొదట్లో ఇబ్బంది ఉండేది. రైతులకు అవగాహన పెంచి 1,800 వరకు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను సమకూర్చి, జీపీఎస్ అమర్చి రవాణా చేయిస్తున్నామని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ సీజన్‌కు సంబంధించి రైతులకు మొత్తం చెల్లింపులు పూర్తి చేశామని పేర్కొన్నారు.

రూ.483 కోట్ల చెల్లింపులు

జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట ప్రామాణికంగా 1,67,053 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. మొత్తం 3,92,594 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఇందులో రైతుల అవసరాలకుపోను 3,23,455 మెట్రిక్ టన్నులను ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా 56,316 మంది కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి రైతులకు చెల్లింపుల కోసం రూ.483.17 కోట్లను అక్నాలెడ్జ్ చేసింది. ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ వేగవంతం కావడం..రైతులకు చెల్లింపులు వెనువెంటనే చేయడంతో సంక్రాంతికే రూ.48 కోట్లు మినహా..మొత్తం చెల్లించి 90 శాతాన్ని జిల్లా అధికారులు పూర్తి చేయగలిగారు. సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైన రూ.48 కోట్లనూ మంగళవారం విడుదల చేయడంతో ఆ మొత్తం రైతుల ఖాతాలకు జమ అవుతోంది. గన్నీకి రూ.3.39 చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతులపై భారం పడకుండా ఈ సీజన్‌లో గన్నీలకు రూ.151.68 లక్షలు, లేబర్ ఖర్చు రూ.381.57 లక్షలు, రవాణా చార్జీలు రూ.893.50 లక్షలు చొప్పున మొత్తం 1,426.75 లక్షలను చెల్లించింది.

ధాన్యం ఇచ్చిన వెంటనే చెల్లింపులు



నేను 130 బస్తాలు ఇచ్చాను. రోజుల వ్యవధిలోనే నా ఖాతాకు డబ్బులు జమయ్యాయి. గతం మాదిరి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా పీపీసీ కేంద్రాలకే వెళ్లి విక్రయించడం వల్ల మద్దతు ధర లభించింది. పంట గిట్టుబాటైనట్లు అనిపించింది.

– ఆవు పారినాయుడు, రైతు, పి.చాకరాపల్లి గ్రామం, బలిజిపేట మండలం

రైతులకు అండగా ప్రభుత్వం



గతంతో పోల్చుకుంటే ప్రస్తుత ప్రభుత్వం రైతును అన్ని విధాలుగా ఆదుకుంటోంది. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరిగాయి. ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పంటపొలాలకు వచ్చి కొనుగోళ్ల విషయంలో సహకరించారు. సకాలంలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. రైతు భరోసా నిధులు సకాలంలో జమ కావడంతో అప్పుల బాధ తప్పింది.

సుంకరి ధర్మారావు, రైతు, పాలకొండ

ఘోర రోడ్డు ప్రమాదం

వారంతా వివిధ పనులు పూర్తిచేసుకుని ద్విచక్రవాహనాలపై స్వగ్రామాలకు బయలు దేరారు. మరో మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ప్రశాంతంగా ఇంటికి చేరుకునేవారు. ఇంతలోనే వారిని మృత్యువు కాటేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. వారి కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చింది.

- ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ
- ముగ్గురు మృతి
- రక్తంతో తడిసిన కొట్టక్కి బ్రిడ్జి
- రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు



జొన్నాడ పురుషోత్తం మృతదేహం



ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న పురుషోత్తం కుటుంబ సభ్యులు



గుండెబోయిన యశోదకృష్ణ మృతదేహం



ఆస్పత్రిలో యశోదకృష్ణ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వేగావతినది బ్రిడ్జిపై గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు అక్కడకక్కడే దుర్మరణం చెందగా, మరో ఇద్దరు సాలూరు సీహెచ్‌సీలో మృతిచెందారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..
రామభద్రపురం మండలం పరిధిలోని జన్నివలసకు చెందిన జొన్నాడ పురుషోత్తం(26), గెద్ద రామ్‌ప్రసాద్, గెద్ద గణేష్‌లు తమ సొంత పనిపై సాలూరు వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో సాలూరు గొల్లవీధికి చెందిన గుండెబోయిన యశోదకృష్ణ(48), గొట్యాడ శ్రీనివాసరావు(26)లు రామభద్రపురం మండలం పరిధిలోని తారాపురం నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సరిగ్గా కొట్టక్కి బ్రిడ్జి మీదకు వచ్చేసరికి ఎదురెదురుగా వస్తూ రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీ కొన్నాయి. జన్నివలసకు చెందిన పురుషోత్తం అక్కడికక్కడే దుర్మరణం చెందగా, యశోదకృష్ణ, గొట్యాడ శ్రీనివాసరావు సాలూరు సీహెచ్‌సీలో మృతిచెందారు. జన్నివలసకు చెందిన రామ్‌ప్రసాద్, గణేష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలంలో మృతిచెందిన పురుషోత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించగా, యశోదకృష్ణ, గొట్యాడ శ్రీనివాసరావు మృతదేహాలను సాలూరు సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించనున్నారు. గాయపడిన ఇద్దరినీ మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ తిరుమల ప్రసాద్, ఎస్‌ఐ జ్ఞాన ప్రసాద్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చెరుకున్నారు. అనంతరం సాలూరు ఆస్పత్రికి వెళ్లి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఎస్‌ఐ జ్ఞాన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

కుటుంబ సభ్యులను చూసేందుకు వచ్చి...



మృతుడు గొట్యాడ శ్రీనివాసరావు


మృతుల్లో జన్నివలస గ్రామానికి చెందిన పురుషోత్తం డిగ్రీ పూర్తి చేశాడు. రాజమండ్రిలో విత్తనాలు దుకాణంలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు అప్పారావు, తవుడమ్మలను చూడటానికి గురువారం సొంత గ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ పోషణకు అందివచ్చిన ఒక్కగానొక్కకొడుకు దుర్మరణం పాలవడంతో ఆ తల్లిదండ్రుల రోదన అంతా ఇంతా కాదు. సాలూరుకు చెందిన యశోదకృష్ణ తన సొంత వృత్తిలో ఉండగా, శ్రీనివాసరావు అదే గ్రామంలో కోళ్లఫారం వద్ద చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. వీరి తల్లిందండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో మృతదేహాలపై పడి బోరున విలపించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ జ్ఞానప్రసాద్

విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఒడిశా అభ్యంతరం

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొటియా గ్రూప్ గ్రామాల్లో ఆంధ్రా అధికారులు ఏర్పాటుచేస్తున్న విద్యుత్‌మీటర్లను ఒడిశా అధికారులు గురువారం అడ్డుకున్నారు. ప్రధానమంత్రి జన్‌మన్‌యోజన పథకం కింద ఉచితంగా మంజూరైన విద్యుత్ మీటర్లను దిగువగంజాయిభద్రలో ఏర్పాటుచేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీనిని గుర్తించిన పొట్టంగి తహసీల్దార్ దేవేంద్రదరువా , డీడీఓ (బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి) సుకాంత్‌పట్నాయక్ , కొటియా పోలీసులు అడ్డుకున్నారు. కొరాపుట్ కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఆంధ్రా ఎలక్ట్రికల్ డీఈ కిశోర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 21 కొటియా గ్రామాలకు సుమారు 19 గ్రామాలకు ఆంధ్రా నుంచే విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. గతేడాది ప్రధానమంత్రి జన్‌మన్‌యోజన పథకం కింద సుమారు వందకు పైగా ఉచిత విద్యుత్ మీటర్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని ఒక్కొక్కటిగా ఏర్పాటుచేస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో దిగువగంజాయిభద్రలో మీటర్ల అమర్చడాన్ని ఒడిశా అధికారులు అడ్డుకున్నారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దిగువగంజాయిభద్ర వద్ద విద్యుత్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న ఒడిశా అధికారులు



విద్యుత్ మీటర్లు

సరిహద్దు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

గుమ్మలక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఒడిశా సరిహద్దు గ్రామాలైన కొండుకుప్ప, లాడ, చింతలపాడులోని పోలింగ్ కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రం భవనాల స్థితిగతులు, మౌలిక వసతులు పరిశీలించారు. భద్రతాపరమైన ఏర్పాట్లపై ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణకు సూచనలు చేశారు. అలాగే, మూలిగూడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. సారా, గంజాయి అక్రమ రవాణా జరగకుండా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి అపరిచితుల కదలికలపై నిఘాపెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌ఐ బి.శివప్రసాద్ ఉన్నారు.



ఒడిశా సరిహద్దు గ్రామమైన కొండుకుప్ప పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



మెంటాడలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తున్న సాలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పార్వతీపురం పట్టణం 23వ వార్డులో ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సాదర స్వాగతం



సీతంపేట: పులిపుట్టిలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన పాలకొండ ఎమ్మెల్యే కళావతికి స్వాగతం పలుకుతున్న గిరిజనులు

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఊరూరా, వార్డువార్డుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రజలు సాదరంగా స్వాగతించారు. హారతులిచ్చి విజయతిలకం దిద్దారు. ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం అందించిన మేలును వివరిస్తూ.. నాయకులతో అడుగుకలిపారు. అండగా నిలిచారు. ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి అఖండ మెజార్టీ అందిస్తామని స్పష్టంచేశారు. – సాక్షినెట్‌వర్క్

తోటపల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, దాతలు, సిబ్బంది

గరుగుబిల్లి: తోటపల్లి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 91 రోజులకు వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీల నుంచి రూ.3లక్షల70వేల947లు, కోదండరామ స్వామి ఆలయం నుంచి రూ.10,375ల ఆదాయం వచ్చిందని ఈఓ సూర్యనారాయణ తెలిపారు. పార్వతీపురం గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగిందన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల నుంచి ఇద్దరు ఏపీ వీవీపీ ఉద్యోగుల తొలగింపు

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ పరిధిలో ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కోట ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న ప్రీతి.ఎల్, ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న రెల్లిమన్మథరావులను టెర్మినేట్ చేసారు. 2022లో వారి నియామకం జరిగింది. వాస్తవంగా వారిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించాలి. కానీ వైద్య విధాన్ పరిషత్ అధికారులు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. మిగతా జిల్లాలన్నింటిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. విజయనగరం జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడంతో అధికారుల తీరుపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైద్య విధాన్ పరిషత్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఔట్ సోరింగ్ ఉద్యోగుల జీతాలకు, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటే కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతం ఎక్కువ.

15 మద్యం సీసాల పట్టివేత

వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారంలో వల్లంపూడి ఎస్సై రాజేష్ నేతృత్వంలో సిబ్బంది గురువారం నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన వ్యక్తి 15 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. దీంతో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో అనుమతుల్లేకుండా మద్యం విక్రయించినా, సారా తయారుచేసి విక్రయించినా చట్టరీత్యాచర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం విక్రయం. సారా తయారీ సమాచారం అందించే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


కొమరాడ: దగ్ధమవుతున్న పూరిల్లు

కొమరాడ: మండలంలోని చినఖేర్జెల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కె.రవికుమార్‌కు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంపై స్థానికులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. గురువారం వేకవజామున నాలుగు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి నిప్పులు రావడం, గ్యాస్ లీక్ అవడంతో అగ్నిప్రమాదం సంభవించింది. వేసవికాలం కావడంతో కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్ర పోవడం వల్ల పెనుప్రమాదం తప్పింది. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణాలతో పాటు పొలానికి సంబంధించిన డాక్యుమెంట్స్, బ్యాంక్ పాస్‌బుక్స్, ఆధార్ తదితర విలువైన వస్తువులతో పాటు రూ.లక్ష నగదు కాలిబూడిదైందని బాధితుడు రవికుమార్ వాపోయాడు.

చినకాదలో మరో ఇల్లు

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామంలో గురువారం తెల్లవారు జామున కోరాడ గంగమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైనట్లు సర్పంచ్ ఆవుగడ్డి ఈశ్వరమ్మ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారి సహాయంతో మంటలు ఆర్పివేయడంతో పెద్దగా ఆస్తి నష్టం జరగలేదని చెప్పారు.

12 కిలోల గంజాయి పట్టివేత

భామిని: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గల బత్తిలి చెక్‌గేట్ వద్ద గురువారం పోలీసులు జరిపిన తనిఖీల్లో ఒడిశా నుంచి అక్రమంగా తరలివస్తున్న 12 కిలోల గంజాయిని ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ పట్టుకుని సీజ్ చేశారు. ఆ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్రీయలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఒడిశాలోని కెందుగూడ నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో రెండు బ్యాగ్‌లతో తరలిస్తున్న గంజాయిని పట్టుబడిందని, సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹ 234

ఎన్నికల అక్రమాలపై నిరంతర నిఘా

- కంట్రోల్ రూమ్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణ
- నియమావళిని ఉల్లంఘిస్తే సీ-విజిల్
- ఫిర్యాదు అందిన 100 నిముషాల్లోనే చర్యలు
- 150కి పైగా వినతులు, ఫిర్యాదుల స్వీకరణ

విజయనగరం అర్బన్:

ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో కంప్లైంట్ సెల్ సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారు. సీ-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర ఆరు విభాగాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు వివిధ విభాగాలకు సంబంధించి 150 ఫిర్యాదులు, వినతులు అందాయి. అత్యధికంగా సీ-విజిల్, ఎన్‌జీఎస్‌పీ మాధ్యమాల ద్వారా వచ్చాయి. వీటిలో ఇప్పటికే 140 పరిష్కరించారు. ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. కంప్లైంట్ సెల్‌కు జిల్లా ప్రణాళిక అధికారి (సీపీఓ) పి.బాలాజీ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్నారు.


మీడియా/టీవీ మోనటరింగ్ విభాగంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

సీ-విజిల్ యాప్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంత వేగంగా, సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సీ-విజిల్ మొబైల్ యాప్. ఇటీవలే అందుబాటులో వచ్చిన ఈ యాప్ ను పౌరులు ఎవరైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయడానికి ఈ యాప్‌ను తెరిచి విండో లో సంబంధిత అంశానికి సంబంధించిన ఫొటో లేదా 2 నిముషాల వీడియో తీసి అప్‌లోడ్ చేయవచ్చు. లైవ్ ఫొటోలు, వీడియోలు, జియో కోర్డినేట్స్ లో సహా ఇది స్వీకరించి పంపుతుంది. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ లేదా ఇతర అధికారులకు సమాచారం వెళ్తుంది. జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా అధికారులు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకొనే అవకాశం కలుగుతుంది. ఆ అంశాన్ని స్క్వాడ్ పరిశీలించి కేవలం 100 నిముషాల్లోనే చర్యలు తీసుకుంటుంది.


సీ-విజిల్ విభాగంలో కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారి, సీపీఓ పి.బాలాజీ

ఓటరు హెల్ప్‌లైన్ 1950

ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇది. ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు జిల్లాకు చెందిన ఓటర్లు నేరుగా ఫోన్‌చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. ఈ కాల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. ఇక్కడకు వచ్చిన ఫోన్లను రికార్డు చేసి, చర్యల కోసం సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

24 గంటల కాల్ సెంటర్

ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటయ్యింది. ఫోన్ నంబర్లు 08922-797120, 08922-797124కు ఫిర్యాదు చేయవచ్చు. ఇవి కూడా 24 గంటలూ పనిచేస్తాయి. ఇక్కడికి వచ్చే ఫిర్యాదులను, వినతులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నదీలేనిదీ ఫోన్‌చేసి తెలుసుకోవచ్చు.

చురుగ్గా సోషల్ మీడియా విభాగం

ఎన్నిల ప్రక్రియలో సోషల్ మీడియా అత్యంత చురుకైన పాత్ర పోషిస్తోంది. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగామ్, యూ ట్యూబ్ తదితర సోషల్ మీడియాపై నిరంతర నిఘా పెట్టేందుకు ఈ విభాగం ఏర్పాటైంది. సోషల్ మీడియాల్లో వచ్చే ఎన్నికల ప్రచారం, ప్రకటనలు, పోస్టింగులపై ఈ విభాగం అధికారులు నిరంతరం పర్యవేస్తున్నారు. రాజకీయ ప్రముఖుల సోషల్ మీడియ ఖాతాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి, వారు పెట్టే పోస్టింగ్‌లను పరిశీలిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించే పోస్టింగ్‌లపై చర్యలు తీసుకుంటున్నారు. దీనిని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

రిపోర్ట్స్ మోనటరింగ్ సెల్

వివిధ విభాగాలకు వచ్చే ఫిర్యాదులు, జిల్లాలో నమోదు చేసిన కేసులు వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిరోజు పంపిస్తున్నారు. ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పరిశీలన అంశాలను నోడల్ అధికారులు ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు.

ఇప్పటి వరకు జిల్లాలో అందిన ఫిర్యాదులు		
స్వీకరించిన మాధ్యమాలు	అందిన ఫిర్యాదులు	పరిష్కరించినవి
సీ-విజిల్ యాప్	66	66
ఎన్‌జీఎస్‌పీ	35	23
1950 హెల్ప్‌లైన్	00	00
సీఈఓ ఏపీ	11	09
ఓటర్ హెల్ప్‌లైన్	18	14
24 గంటల కాల్ సెంటర్	12	11
ఓటర్ పోర్టల్, ఓటర్ మిత్రా	17	17
మీడియా సెల్	24	21
సోషల్ మీడియా	02	02

ప్రశాంతంగా న్యాయవాద సంఘం ఎన్నికలు


మద్దతు దారులతో గెలుపొందిన అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. 473 మంది సభ్యులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఓటింగ్ ప్రక్రియలో సీనియర్లు, జూనియర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించగా సాయంత్రం 6 గంటలకు ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికలకు పి. శ్రీరామ్మూర్తి, కె.రవిబాబు, ఏపీఎన్ పద్మజ అధికారులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అల్లాడ హరీష్ తన సమీప ప్రత్యర్థి కె. శ్రీనివాసరావుపై 109 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా దాసరి ఈశ్వరరావు సమీప ప్రత్యర్థి పి.శివప్రసాద్‌పై 45 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జాయింట్ సెక్రటరీగా వైపీవీఆర్ మూర్తి, కోశాధికారిగా భీంపల్లి రవి విజయం సాధించారు. తమ విజయానికి సహకరించిన సీనియర్, జూనియర్ న్యాయవాదులకు గెలుపొందిన అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా వారంతా పేర్కొన్నారు.

నవ్విపోదురు గాక..!

- టీడీపీ నాయకుల గిమ్మిక్కులు
- పార్టీలో ఉన్న వారికే మళ్లీ కండువాలు

గజపతినగరం రూరల్: ఎన్నికల సమయంలో ఓట్లు ఎంతో కీలకం కాబట్టి ఎంతటివారైనా తమ పార్టీలోకి వస్తే పార్టీ బలంగా తయారవుతుందనే ఆశ సంబంధిత పార్టీ నాయకులకు ఉండడం సహజమే. అయితే అదే పార్టీలో ఉండే వారిని మళ్లీ తమ పార్టీలోకి చేర్చుకోవడం చూస్తే వీరికేమైనా మతి భ్రమించిందా అని స్థానికులు నవ్వుకుంటున్నారు. ఈ మేరకు గజపతినగరం మండల కేంద్రంలోని 6వవార్డుకు చెందిన ఎడ్ల గోపి టీడీపీ నుంచి వార్డు మెంబర్‌గా గెలిచారు. ఆయన కొన్నాళ్లుగా టీడీపీలోనే కొనసాగుతున్నారు. గతంలో కూడా టీడీపీ నాయకుడు కరణం శివరామకృష్ణ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు స్థానికుల సమాచారం. అయితే గురువారం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నాడంటూ గజపతినగరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, గోపీతో పాటు కొంత మందికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ విషయమై సదరు గోపీ వద్ద సాక్షి ప్రస్తావించగా తాను వైఎస్సార్‌సీపీలో ఎప్పుడూ పనిచేయలేదని, ఇప్పటివరకూ టీడీపీలో అఫీషియల్‌గా చేరలేదని అందుకే ఈరోజు టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నాని చెప్పారు.


ఎడ్లగోపీతో పాటు, అనుచరులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

పైడితల్లి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ డీవీవీ.ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని గురువారం అమ్మవారి కల్యాణ మంటపంలో లెక్కించారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ 29 రోజులకు గాను రూ.10 లక్షల 94వేల 587 నగదు, 24 గ్రాముల 400 మిల్లీ గ్రాముల బంగారం, 92 మిల్లీ గ్రాముల వెండి లభించిందన్నారు. అదేవిధంగా వనం గుడి హుండీల ద్వారా 90 రోజులకు రూ.8 లక్షల 38వేల 713 నగదు, 5గ్రాముల 400 మిల్లీ గ్రాముల బంగారం, 315 మిల్లీ గ్రాముల వెండి లభించిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి జాతర ఆదాయం రూ.6.81లక్షలు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో కొలువైన పైడితల్లి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం రాత్రి లెక్కించారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో జరిగిన అమ్మవారి జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా దర్శనం టికెట్ల ద్వారా రూ.1,19.480, హుండీల ద్వారా రూ.5.62,405లు మొత్తం కలిపి రూ.6.81,885లు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వై శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ఆదాయం లెక్కింపులో ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర కీలకం


శిక్షణ కార్యక్రమంలో పీఓ,ఏపీఓలనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర అత్యంత కీలకమని, తప్పు దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ, విధులు, బాధ్యతలు, ఈవీఎంలు, వీవీప్యాట్ల పనితీరు పట్ల ప్రిసైడింగ్ అధికారులు(పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీఓ)కు చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లలో పీఓలదే పూర్తి అధికారమని తెలిపారు.అందరి విధులపైన పీఓలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు,పొరపాట్లు జరగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను,అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించరాదని హితవు పలికారు. జిల్లాలోని 360 సున్నిత పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా విధులను నిర్వహించాలని, ప్రతిచోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని సూచించారు. మాక్‌పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని చెప్పారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్టులను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5:30గంటలకే మాక్‌పోల్ జరుగుతుందని, ముందు రోజు రాత్రే బూత్‌లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని తెలిపారు. మూడు విడతల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్, ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

లోపాలకు తావులేకుండా పోలింగ్ నిర్వహణ

విజయనగరం అర్బన్: జిల్లాలో జరిగే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలింగ్ నిర్వహణలో లోటుపాట్లకు తావివ్వకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. ఈ మేరకు విజయనగరంలోని ఎంఆర్ కళాశాలలో గురువారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పీఓలు, ఏపీఓల శిక్షణ తరగతుల్లో జేసీ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ నిబంధనలపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకుని విధులు నిర్వర్తించడం ద్వారా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఉండదన్నారు. అలాగే ఎస్.కోట, నెల్లిమర్లలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జేసీ పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు సూకరాజు, మురళీకృష్ణ, విజయనగరం తహసీల్దార్ రత్నం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ మరణాలు అరికట్టవచ్చునన్నారు. ఎండతీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి (104 డిగ్రీలఫారన్ హీట్) మెదడు మీద ప్రభావం చూపుతుందని, దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం దెబ్బతిని వడదెబ్బ బారిన పడతారన్నారు. చెమట పట్టికపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి, ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపించినట్లయితే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా గొడుగు వాడడం, తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలని చెప్పారు. తలకు టోపీ కానీ రుమాలు కానీ వాడాలన్నారు. వేడిగాలులు తగలకుండా చూసుకోవాలని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయకూడదని చెప్పారు. దూర ప్రయాణాలు చేయవలసి వచ్చినప్పుడు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత చేయాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచి నీరు తాగాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లాలని, చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు అలాగే చేస్తూ ఉండాలని చెప్పారు.

చంద్రబాబువి బూటకపు హామీలు

- ఎన్నికల ప్రచారంలో ఉపముఖ్యమంత్రి

మెంటాడ: మూడు సార్లు ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు పరిపాలించిన చంద్రబాబు 2014లో ఇచ్చిన ఒక్క హామీనైనా నెరవేర్చారా? మళ్లీ ఇప్పుడు బూటకపు హామీలతో వస్తున్నారు జాగ్రత్త అని ప్రజలను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హెచ్చరించారు. ఈ మేరకు సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. గతంలో భారతదేశంలో ఏ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రులను, మంత్రులను, ఎమ్మెల్యేలను ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించి లబ్ధి అందుతున్నదీ లేనిదీ కనుక్కోవాలని, ఒకవేళ అందకపోతే ఆ సమస్యను తక్షణమే పరిష్కరించిన ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమన్నారు. ఒక్క జగన్ మోహన్ రెడ్డి మాత్రమే ఇచ్చినమాటను నిలబెట్టుకున్నారని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను తెలుసుకుని మరిన్ని పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. గడప గడపకు రాజన్నదొర వెళ్తున్నప్పుడు ప్రజలంతా మాట్లాడుతూ మేమంతా సంతోషంగా ఉండాలంటే ఇక్కడ మీరు ఎమ్మెల్యేగా.. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని దీవించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, రంగరాజు, స్థానిక సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ పతివాడ కుమారి, లింగేశ్వరరావు మాస్టారు, అప్పలనాయుడు మాస్టారు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీకి ఓటేయాలంటూ కరపత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మానవాళి జీవితానికి మార్గదర్శకం భగవద్గీత

విజయనగరం: భగవద్గీతను ఆధ్యాత్మిక జ్ఞానంతో ఉపకరిస్తే జీవితం నేపథ్యాన్ని తెలియజేస్తుందని, మానవ జీవితంలో శాంతి,ఆనందం, ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకంగా ఉంటుందని విశాఖపట్నానికి చెందిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త, నిష్కామ ఫౌండేషన్ అధ్యక్షురాలు అరుణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పట్టణంలోని కొత్తపేట మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7:15 గంటల వరకు శ్రీ మన్నార్ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ మద్భగవద్గీత రెండవ అధ్యాయం, సాంఖ్యయోగంపై ప్రవచించనున్నట్లు తెలిపారు. నేటి యువత భగవద్గీత గురించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ మాటూరు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కూరెళ్ల సరోజిని, రమేష్‌ల సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో నరసింగరావు, కాపుగంటి వరహాలు, శెట్టి సూర్యకాంతం, జి.వీరభద్రరావు పాల్గొన్నారు.

జాతరలో ఆటో మాయం

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో మూడురోజులుగా జరుగుతున్న కనకదుర్గతల్లి అమ్మవారి జాతరలో ఓ ఆటో మాయం అయింది. భోగాపురంలో జరుగుతున్న జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు డెంకాడ మండలం చుక్కవానిపేట గ్రామానికి చెందిన చుక్క సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి తన సొంత ఆటోలో భోగాపురం వచ్చాడు. ఈ క్రమంలో ఆటోను మార్కెట్ సెంటర్‌లో పార్కింగ్ చేసి కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. అమ్మవారిని దర్శించుకుని తిరిగి వచ్చి చూసేసరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ గురువారం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన చీపురు ఉమామహేష్(40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వివాహ మంటపంలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు స్పందించి బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లలిత ఉంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపారు.